29082024-DIS-04_Layout 1 8/29/2024 2:47 AM Page 1

నమస్తే తెలంగాణ

న్యాయం పేరిట అన్యాయం

ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు జోక్యంతో బెయిలు లభించడం న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని మరింత బలోపేతం చేసే అంశమని చెప్పాలి. అయితే అందుకు ఆమె అలుపులేని పోరాటం సాగించారనేది మరువరాదు. దిగువ కోర్టుల్లో బెయిలు కోసం జరిపిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో కవిత సర్వోన్నత న్యాయస్థానం తలుపు తట్టారు. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం కవితకు బెయిలు మంజూరు చేస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఇందులో ముందుగా చెప్పుకోవాల్సింది ఢిల్లీ హైకోర్టు బెయిలు నిరాకరణకు చూపిన కారణాలను సుప్రీంకోర్టు తిరస్కరించడం. బెయిల్‌కు కవిత అన్ని విధాలా అర్హురాలని ధర్మాసనం గట్టిగా సమర్థించింది. సీబీఐ చార్జిషీట్ దాఖలైంది. ఈడీ దర్యాప్తు పూర్తయింది. దర్యాప్తు సంస్థల నుంచి కేసు విచారణ కోర్టుకు వచ్చింది. విచారణ ప్రారంభమయ్యాక నిందితులను ఇంకా జైలులో ఉంచడం ఏమిటి? దీంతో పాటు మహిళలకు ఉండే ప్రత్యేక వెసులుబాటును గుర్తిస్తూ సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

ఇదంతా ఒకెత్తు అయితే ఢిల్లీ మద్యం కేసును జాతీయ దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ నడిపిస్తున్న తీరును సర్వోన్నత న్యాయస్థానం ఎండగట్టడం ఒకెత్తు అని చెప్పాలి. ఆ రెండు సంస్థలపై అసాధారణ మైన రీతిలో సుప్రీంకోర్టు విరుచుకుపడటం గమనార్హం. వాటి తీరు తెన్నులను ఎండగడుతూ తలవాచేలా చీవాట్లు పెట్టింది. న్యాయం పేరిట నడిపిస్తున్న కేసులో న్యాయమెంత? అనేది ప్రధాన చర్చనీయాంశమైంది. ఈ మొత్తం దర్యాప్తు వ్యవహారంలో 'న్యాయబద్ధత' ఉన్నదా? అనే నిలదీత ధర్మాసనం తీర్పులో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఎడతెగని దర్యాప్తు, ఎటూ తేలని సాక్ష్యంతో సాగదీస్తున్న కేసులో నిందితులను నిరవధికంగా జైలులో మగ్గబెట్టడం ఎలా కుదురుతుందని ప్రశ్నించింది. 'కేవలం అప్రూవర్‌గా మారిన నిందితుల వాంగ్మూలమే సాక్ష్యంగా చూపుతూ దర్యాప్తు నడిపించడం సబబేనా?' అని ధర్మాసనం నిలదీసింది.

ఒక నిందితుడు చేసే ఆరోపణలతో ఎవరినైనా నిందితులను చేయడమనేది ఇక్కడ ప్రధాన సమస్య. కేంద్ర దర్యాప్తు సంస్థలు అనుసరిస్తున్న ఈ ప్రక్రియ సర్వదా విమర్శలకు గురవుతున్న సంగతి తెలిసిందే. ఆధారాలు లేని అభియోగాలతో రోజులు, నెలలు, సంవత్సరాలు అన్నట్టుగా గడిపేస్తున్న తీరు దర్యాప్తు సంస్థల ప్రామాణ్యాన్ని సందేహాస్పదం చేస్తున్నది. 50 వేల పేజీల డాటా సేకరించామని అంటున్నారు. కానీ, ఒక్క రూపాయి కూడా స్వాధీనం చేసుకోలేదు. ఆరోపణలు కాకుండా కనీసం ఒక్కటంటే ఒక్క ఆధారాన్ని చూపలేకపోయారనేది సుప్రీంకోర్టు దర్యాప్తు సంస్థలకు శరపరంపరగా సంధించిన ప్రశ్నల్లో ఒకటి. ఈ సందర్భంగా సెల్‌ఫోన్ డాటాను కవిత ధ్వంసం చేశారన్న ఆరోపణను కూడా ధర్మాసనం తిరస్కరించింది. ఫోన్‌లో చాటింగ్‌ను తొలగించడం నేరం కాదని.. ఫోన్ ఫార్మాటింగ్, ఫోన్ ట్యాంపరింగ్ ఒకటి కాదని తేల్చిచెప్పింది. ఈ విచారణ ఎప్పుడు ముగుస్తుందో తెలియదని అయోమయాన్ని వ్యక్తం చేయడం మరో హైలైట్. అయితే ఈ కేసులో కోర్టు చేసిన వ్యాఖ్యలు భవిష్యత్తులో మార్గదర్శకంగా ఉంటాయని చెప్పవచ్చు. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన తరుణమిది. ఎడాపెడా కేసులు పెట్టి, ఇష్టారాజ్యంగా అరెస్టులు సాగించే ధోరణిని ఇకనైనా ఆపితే మంచిది.

ధ్వంస రచనపై న్యాయవ్యవస్థ కొరడా

ఇంగ్లీష్‌లో poetic justice అనే పదబంధం ఉన్నది. కవితా న్యాయం అని అర్థం. ఆధ్యాత్మికులు దీన్ని law of karma అని కూడా అంటారు. ఘనత వహించిన సీబీఐ, ఈడీకి దేశ అత్యున్నత న్యాయస్థానం మంగళవారం చేసిన వ్యాఖ్యలు కవితా న్యాయం! రాజ్యాంగబద్ధ వ్యవస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకొని దుష్ట రాజకీయానికి తెగబడిన బీజేపీకి కొట్టిన సుప్రీం దెబ్బ నిశ్చయంగా గొప్ప ప్రజాస్వామ్య విజయం. ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని ధ్వంసం చేద్దామనే బీజేపీ కూహకాన్ని విధ్వంసం చేసిన చారిత్రక ఘటన తెలంగాణ ఉద్యమకారిణి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావడం! Nothing more, nothing less!!

శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371

'మీ ఇష్టారాజ్యం నడువదు' అన్న సుప్రీం హెచ్చరిక పొయెటిక్ జస్టిస్ లాంటి కర్మ ఫలమే. 'మొండిదానిని జగమొండి చేసిన్రు'ని కవిత అన్న మాటలు మనకు సంకేతం, స్ఫూర్తి కావాలి. తమపై కక్ష గట్టిన బీజేపీపై తెలంగాణ సమాజం జగమొండిగా కొట్లాడాల్సిన సందర్భం ఇది. ఎందుకంటే కేసీఆర్‌కు కవిత ఒక్కరే బిడ్డ కాదు. రాష్ట్ర సాధకుని పిల్లలమే మనమంతా! మన చైతన్యమే అసలు సిసలు కవితా న్యాయం!

> **'సామాజిక సేవారంగంలో కృషి చేస్తూ, ఎంపీగా, ఎమ్మెల్సీగా సేవలందించే మహిళ ఎక్కడికీ పారిపోదు. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ విచారణ కోసం ఆమెను నిరంతరం జైలులో ఉంచడం తగదు' అని కవిత బెయిల్ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.**

తెలంగాణలో ఏ మూలకు పోయినా బతుకమ్మ అనగానే గుర్తొచ్చే రూపం కల్వకుంట్ల కవిత. 'జాగృతి' ద్వారా సమాజాన్ని తట్టిలేపడం ముమ్మాటికీ సామాజిక సేవయే. సేవ కంటే సామాజిక సంస్కరణ అనడం సమంజసం. నదిలా తను ప్రవహించే నేలంతా సారవంతం చేసినట్టు... కేసీఆర్ తెలంగాణను చైతన్యపరుస్తూ, తానూ పులకిస్తూ మొక్కవోని దీక్షతో తెలంగాణ రాష్ట్రం సాధించిన్రు. ఆయన తనయగా, బాధ్యత గల్ల తెలంగాణ బిడ్డగా కవిత తన వంతు పాత్ర అజేయంగా పోషించిన్రు. సాధించుకున్న తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన్రు కేసీఆర్. 'ప్రగతిలో మీరు నెంబర్ వన్' అంటూ అలుపు లేకుండా ప్రతిరోజూ తెలంగాణకు అవార్డులు, రివార్డులు పదేండ్ల పాటు ఇచ్చిన ఆర్బీఐ, నీతి ఆయోగ్, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల దగ్గర ఆ సమాచారం ఉంటుంది, ఎవరైనా తెప్పించుకోవచ్చు!

అట్లా ధగధగాయమానంగా, జగజ్జేయంగా వెలుగుతున్న తెలంగాణ మాడల్‌ను దేశవ్యాప్తం చేయాలని టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చిన్రు కేసీఆర్. రాజకీయాల్లో గుణాత్మక మార్పు ద్వారా దేశ నవ నిర్మాణం కోసం కేసీఆర్ ఎత్తుకున్న 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' యజ్ఞం నుంచి పైకి రేగిన నిప్పు రవ్వలు బీజేపీకి కలవరం పుట్టించినై! పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌లాగ భిక్షుక దేశం కాదు.. చైనా, సింగపూర్, మలేషియాలాగ సుభిక్ష దేశం కావాలని ఆశించే మీరూ, నేనూ, మనందరి లాగ కవిత కూడా బీఆర్ఎస్ యజ్ఞంలో భాగస్వామి.

మరోవైపు మోదీకి పక్కనే బల్లెంలా కేజ్రీవాల్ మారిన్రు. మొహల్లా క్లినిక్‌లు, అందరికీ స్వచ్ఛమైన నీళ్లు, నాణ్యమైన విద్యుత్తు, దేశం అంతకు ముందు ఎప్పుడూ చూడని స్థాయిలో విద్యాలయాల ద్వారా ఢిల్లీ ప్రజల జీవన ప్రమాణాలు 'ఆప్' సర్కార్ పెంచడం, ప్రజల మద్దతుతో వెలిగిపోతున్న 'ఆప్' ప్రభ బీజేపీకి కంటగింపైంది.

తన మాట వినని, తనకు నచ్చని ప్రభుత్వాలను తొమ్మిదింటిని కూల్చింది బీజేపీ. ఆ పనే చేయబోయి తెలంగాణలో చేతులూ, మూతీ అన్నీ కాల్చుకున్నది. ఇక అప్పటి నుంచి వారికి కునుకు లేదు. కేసీఆర్, కేజ్రీవాల్‌ను కట్టడి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నది. 'లిక్కర్ కేసు' పేర అభియోగం మోపి కల్వకుంట్ల కవితను అరెస్టు చేసి, 165 రోజులు జైలులో ఉంచింది. నిన్న సుప్రీం కోర్టు సీబీఐ, ఈడీలపై చేసిన వ్యాఖ్యలు నిజానికి నరేంద్ర మోదీకి తగులుతయి.

మనం ఏయే అభివృద్ధి సూచీలలో ఎంతెంత వెనుకబడి ఉన్నామో, ఎట్లా మన దేశాన్ని ప్రపంచంలో మేటి శక్తిగా తయారు చేయవచ్చో మీకందరికీ తెలుసు. గణాంకాల సైతంగా కేసీఆర్ ఎన్నోసార్లు చెప్పి ఉన్నరు. అవన్నీ ఒక్క క్లిక్‌తో మీకు దొరుకుతయి కాబట్టి ఆ వివరాల్లోకి పోవడం ఈ వ్యాసం ఉద్దేశం కాదు.

> **సకల వనరులు ఉన్నై, వాటిని ఉపయోగంలో పెట్టే సకల జనమూ ఉన్నరు, ప్రపంచం ఆశ్చర్యపోయే అభివృద్ధి సాధ్యమే, పదేండ్ల తెలంగాణ నిలువెత్తు ఉదాహరణగా ఉన్నది, దేశానికి దివిటీ చూపిస్తున్నది... పదండి దేశాన్ని బాగు చేసుకుందాం' అని కేసీఆర్ పిలుపు ఇచ్చిన్రు. దేశభక్తి మీద భక్తి తప్ప దేశం మీద భక్తి లేని మూకలు సహజంగానే సహించలేని రాజకీయం కేసీఆర్‌ది. ఆ టాస్క్ మాస్టర్ గొంతు నులమాలని బీజేపీ కంకణం కట్టుకున్నది. అందులో భాగమే ఎమ్మెల్సీ కవిత అరెస్టు.**

https://www.indiabudget.gov.in/doc/rec/annex9.pdf ఈ ఫైల్ ఓపెన్ చేయండి విజ్ఞులారా. భారత ప్రభుత్వ ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌లో ఉన్న అధికార అప్పుల చిట్టా అది. మన దేశ అప్పు రూ.1,81,68,456 కోట్లు!. ఈ తెచ్చిన పైసలన్నీ ఏమైనయి? ఎవరికి పెట్టిన్రు? మీకు ఎవరికన్నా గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపునకు వాడిండా మోదీ? జేబులో పర్సును చూసి రెండొందలా లేక ఒక వంద చాలేమో అంటూ చింతలు పడుతూ బండిలో పెట్రోల్ పోయించే మిమ్మల్ని ఏమన్నా ఆదుకోవడానికి విదిలిస్తున్నడా ఆ పైసలు? పెన్సిల్, షార్పనర్‌పై జీఎస్టీ వేసి మీ చిన్నారుల చదువును మొద్దుబార్చడం తప్ప వారికేమన్న తాతలా సహాయపడుతున్నడా? 'యోగక్షేమం వహామ్యహమ్' అని లోగో పెట్టుకుని జీవనం లోనూ, జీవనం అనంతరమూ భరోసా పడే ఎల్ఐసీని భక్షిస్తూ మీ భద్ర జీవనానికి తూట్లు పొడిచే పాలసీ ఎందుకు తెచ్చిండు? అన్నేసి కోట్ల అప్పు లు మన మీద రుద్ది ఇంకా కక్కుర్తి ఎందుకు? మీ అవ్వాతాతలకు రైళ్లలో రాయితీ ఎత్తేసి మిగిల్చిన పైసలు ఏమి చేస్తున్నడు? ఎందుకు అందరికీ తాగునీరు లేదు. ఎందుకు వ్యవసాయ భూము లు ఎండిపోతున్నయి? ఎందుకు కరెంటు లేక చీక ట్లో వేలాది గ్రామాలు మగ్గుతున్నయి? ఏమి చేస్తున్నరు ఆ పైసలన్నీ? ఎవరికి దోచిపెడుతున్నరు?

ఇగో... ఈ ప్రశ్నలడిగిండు కేసీఆర్. ఆ ప్రశ్నలను సమాధి చేయడానికి, అడుగుతున్నవారిని దెబ్బ కొట్టడానికి సినిమాలో చీప్ విలన్ చేసే పనే మోదీ చేస్తున్నడు. అదే కల్వకుంట్ల కవితపై దాడి. దేశం నివ్వెరపోయే మహా దోపిడీ వ్యవహారం నుంచి అదానీని రక్షించే పనిలో ఉన్న మోదీ... పార్లమెంట్‌లో సరైన ప్రశ్నలు రాకొద్దు అనుకుంటున్నడు. అందుకే కుత్సితమైన ప్రశ్నలు ఈడీ ద్వారా వేయిస్తున్నడు. మనమైనా ఆలోచించవద్దా, ప్రశ్నలు ఏవి, ప్రశ్నలను ప్రశ్నించాల్సిన ప్రశ్నలేవి అని, మేధావులారా?!

'20 నెలల పాటు విచారణ జరిపి, 493 మంది సాక్షులను, 57 మంది నిందితులను విచారించామని చెప్తున్నరు. 50 వేల పేజీల కొద్దీ సాక్ష్యాలు సేకరించినట్టు రికార్డుల్లో పేర్కొన్నరు. మీరన్నట్టు.. ఇంత పెద్ద స్కామ్ జరిగితే, ఒక్క రూపాయి కూడా రికవరీ చేయకపోవడమేంటి? అసలు స్కామ్ జరిగినట్టు రుజువులేమిటి? పిటిషనర్ అయిన మహిళ ఐదు నెలలుగా విచారణ ఖైదీగా జైల్లోనే ఉన్నరు. పూర్తి కేసు తేలేందుకు చాలా సమయం పడుతుంది. విచారణ భవిష్యత్తులో ముగిసే అవకాశం కనిపించడం లేదు. ఈ విచారణ ఎప్పుడు ముగుస్తుందో తెలియదు' అన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను మనం జాగ్రత్తగా గమనించాలి. ఈడీ దాడులకు గురై ఆ తర్వాత బీజేపీ తీర్థం పుచ్చుకొని కేసులలోంచి బయట పడ్డ ఎందరో నాయకుల పేర్లు ఈ వాక్యాలు చదువుతుండగానే మీకు స్ఫురిస్తాయి. అంటే బీజేపీ రిక్రూట్‌మెంట్ సెల్‌గా ఈడీ ఎంతటి నీచ పాత్ర పోషిస్తున్నదో తెలుస్తున్నది కదా. సుప్రీం కొరడా ఝళిపింపు అందుకే!

'నిందితులను ఇష్టమొచ్చిన రీతిలో అప్రూవర్లుగా మార్చి, వారిచే అనైతిక స్టేట్‌మెంట్లు ఇప్పించారంటూ సుప్రీం వాడిన పదజాలం బీజేపీకి సిగ్గుచేటు. అయినా కేంద్ర మంత్రి బండి సంజయ్ వదరుబోతు మాటలు మానలేదు. సుప్రీంకోర్టుకే తప్పుడు ఉద్దేశాలు ఆపాదిస్తూ రాజకీయ పార్టీలకు తలొగ్గుతోందనే ధ్వని వచ్చేట్టు బాధ్యతారాహిత్యంగా మాటలాడిండు! అటు కాంగ్రెస్ ఏమీ తక్కువ తినలేదు. సోనియా, రాహుల్, రేవంత్‌ల బెయిళ్లు కూడా సుప్రీం రాజకీయమేనా? ఇంత వాచాలతను సహించాలా? సుప్రీంకోర్టుపై ప్రజల విశ్వాసం సన్నగిల్లితే రాజ్యాంగానికే ప్రమాదం కదా? వీధి రౌడీల్లాంటి ఈ రెండు పార్టీలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ చేపట్టాలి. మినుకు మినుకు మనే ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయాలి.

ఒకటే కేసులో కేజ్రీవాల్‌పై ఒకరకంగా, కవితపై మరొక రకంగా వ్యవహరిస్తున్నది కాంగ్రెస్. ఇలాంటి చిల్లర పార్టీలతో బీఆర్ఎస్ విలీనం అవుతుంది అని ఇద్దరూ పోటీ పడి ప్రచారం చేయడం హాస్యాస్పదం. మురికి కూపాలలో మునిగి తేలడానికి బీఆర్ఎస్ చరిత్ర లేని పార్టీ కాదు, చరిత్రా, భూగోళమూ సృష్టించిన సునామీ బీఆర్ఎస్! అలాంటి పార్టీపై, కేసీఆర్ కుటుంబంపై రాజకీయ పార్టీలకంటే అధ్వాన్నపు విష ప్రచారానికి ఒడిగట్టిన యూట్యూబ్ ఛానెళ్లు, సోషల్ మీడియా వేదికలు పునరాలోచించుకోవాలి. మీ వ్యక్తిగత కోపాలు వ్యవస్థలను నాశనం చేసే శక్తులకు ఆయుధాలైతున్నయి. ఆయుధాలకు విచక్షణ ఉండదు. అవి రేపు మీపై కూడా విరుచుకుపడుతయి. చరిత్రలో అలాంటి దృష్టాంతాలు కోకొల్లలుగా ఉన్నయి. గమనించండి, తెలివి తెచ్చుకోండి, బాధ్యతగా మెలగండి.

> **విజ్ఞులైన ప్రజావళి లోతుగా ఆలోచించాలి. తెలంగాణను, దేశాన్ని కబళించాలని చూస్తున్న రెండు జాతీయపార్టీల పట్ల అప్రమత్తత అవసరం. అందుకోసమైనా పార్టీలకతీతంగా కవితకు దన్నుగా నిలవాలి, కేసీఆర్‌కు అండగా ఉండాలి.**

సుప్రీం ఒక దారి చూపించింది. ముళ్లుంటై ముప్పులుంటై, కానీ తప్పదు- ఈ దేశం కోసం! సిద్ధమే కదా?! జై భారత్!!

మేధావులు ఏమైపోయినట్టు?

డాక్టర్ చెన్నమనేని హన్మంతరావు
98490 18120

ఇంతకీ ఎవరు మేధావులు? బాగా చదువుకొని పీహెచ్‌డీ పట్టా పొందినవారా? సామాజిక స్పృహతో సమాజంలో ఉన్న, సమాజానికి పట్టిన రుగ్మతలను ఎలా నయం చేయాలనే సంకల్పం గలవారా? అలాంటి రుగ్మతలను కలిగిఉన్న, వ్యాధిగ్రస్థమైన అవయవానికి లేదా వ్యక్తికి ఇక మందులు పనిచెయ్యవు, శస్త్రచికిత్స ఒక్కటే మార్గమని, అవయవ ఛేదనే దానికి సరైన చికిత్స అని నిర్ణయం తీసుకునేవారా? లేదా ఒక వ్యవస్థకు, ఒక వ్యక్తికి బందీ అయిపోయి వారి వ్యతిరేక వర్గాన్ని పొద్దునలేచిన దగ్గర్నుంచి విమర్శిస్తూ (తిడుతూ) బాగుపడేవారా? (బతకనేర్చినవారా?). వీరిలో ఎవరు మేధావులు? ఒక దృశ్య మాధ్యమం వారి వ్యతిరేకులను ఎలా ఉతికిపారేసిందో మొన్నటివరకు మనం చూశాం. అలాంటి కొందరు వ్యతిరేకులను కూడా మనం ఇంకా చూస్తున్నాం.

పొద్దునలేచిన దగ్గర్నుంచి సాయంత్రం దాకా ఏ మాధ్యమం దొరికితే ఆ మాధ్యమంలో వారి పోషకులకు అనుకూలంగా ఉతికిపారేయడం, ఇప్పటికీ ఆ చాకిరేవు ఇంకా నడుస్తుండటం కూడా చూస్తున్నాం. మేధావులంటే వీరేనా? కావొచ్చు. కాకపోతే నానారకాల ప్రజలకు నానా రకాల పథకాల్ని రచించి, నిరంతరం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే దాకా ఆలోచించినవారిని.. మాధ్యమాల్లో ఊదరగొట్టి దించేసేదాక వదల్లేదు కదా! ఆ మేధావుల మూతులు కొన్ని ఇప్పుడు మూతబడ్డాయి. ఎందుచేత? అది వారికి తెలుసు, మనకు తెలుసు. ఇక్కడో రకం మేధావులున్నారు.

నేతన్నలకు ఒక పథకం, దళితులకు ఒక పథకం, గొల్లకుర్మవారికి ఒక పథకం అంటూ సమాజానికి ఏదో చేయబోతే.. గడీల పాలన, దొరల పాలన అంటూ కల్లబొల్లి మాటలతో ఊదరగొట్టిన నోర్లు ఇప్పుడెందుకు మూతబడ్డాయో మరి! మేధావుల మెదళ్లలో ఉన్న తెలివి అయిపోయిందా, లేక మేత మేస్తున్నాయా? ధర్మాన్ని మరిచి స్వార్థమొక్కటే రాజ్య మేలితే ఇటువంటి ఫలితాలే కనిపిస్తాయి.

సమాజానికి ధర్మం చెప్పి, ధార్మిక చింతన నేర్పే కర్తవ్యమున్నవారు ఇంకొక రకం మేధావులు. వారి మేధల్ని అమ్మకానికి పెట్టారా? మరి చేతి ఐదు వేళ్లకు ఐదు ఉంగరాలు కావాలి, మెడలో బంగారు హారాలు కావాలి, ముంజేతి కడియాలు కావాలి. అయినా సమాజ మంతా అలానే పోతుంటే వారు మాత్రం ఏం చేస్తారు? కానీ, నాకొక అనుమానం. సమాజంలో విలువ వీటిని ధరిస్తేనే వస్తుందా? గతంలో మహామహోపాధ్యాయుల్ని చూశాం, పుంభావ సరస్వతుల్ని చూశాం. వారికి ఏం లేవు. వారిప్పుడు లేకున్నా వారిని తలుచుకుంటున్నాం. ఇదిగో మేధావులు ఒక్కడ కొందరున్నారు. 'నాకిదివ్వు, నీకిదిస్తా' అనే ఒక రకం మేధావి వర్గం దేవునితో బేరమాడుతూ, ఆయన ఇంటర్వ్యూ కోసం వెంపర్లాడుతూ దేవాలయాల్ని నింపేస్తున్నది. ఇదొక రకం మేధావివర్గం. ఇదిగో ఇక్కడుంది. చాలా రోజుల కిందట ఒక కవిత చదివాను. దాని కింద రాసిన కామెంట్ వల్ల జ్ఞాపకం వస్తూ ఉంటుంది. పుచ్చిపోయిన సమాజాన్ని విమర్శించిన కవిత కింద ఒక మేధావి రాసిన కామెంట్ ఇలా ఉంది. 'కవిత బాగుంది! చదువుకోవడానికి హాయిగా ఉంది. యతిప్రాసలు, భాష అద్భుతం. కానీ, ఆయన వివరించిన సమస్యకు జవాబు లేదు. ఆ సమస్యను ఎలా పరిష్కరించాలి? ఎవరు పరిష్కరించాలి? చెప్పలేదు. కవితాప్రియులు చదివి అనుభవించారు. అంతే, మరిచిపోయారు. కొందరు పాపం! సమస్యల్ని పరిష్కరిద్దామని సమాజంలో ఉంటూ కాదు, అడవిలో ఆలోచిద్దామని అడవికి వెళ్లారు. ఏదేదో చేశారు. ఏమైంది. కొందరు ఆ రుగ్మతలు వారికంటుకొని కనుమరుగయ్యారు. మానవులకున్న సహజ బలహీనతలు కొందర్ని బలిచేశాయి. కొందరు చట్టానికి బలైపోయారు. ఇదొక రకం మేధావి వర్గం.

ఒక పెగ్గు వేసి, ఒక సిగరెట్ వెలిగించి కొందరు మేధావులు అర్థవంతమైన కవితలు వెలువరించారు (నిజంగా బాధతోనే కావొచ్చు). కానీ, అవి కాలగర్భంలో కలిసిపోయాయి. వారూ వెళ్లిపోయారు. కానీ, సనాతన కావ్యాలు రామాయణ, భారతాలు కనుమరుగు కాలేదు. అవి నిత్యనూతనంగా (కొందరికి) వెలుగుతూనే ఉన్నాయి. కొందరికి అధికార పీఠమెక్కడానికి సోపానాలుగా కూడా పనికొస్తున్నాయి. అవి కనుమరుగు కాకపోవడానికి కారణం అందులో సమాజ రుగ్మతల్ని వర్ణిస్తూ వాటి నివారణకు, చికిత్సలకు మార్గాల్ని కూడా చూపుతున్నాయి. ఇదీ కారణం. మరి వీటిని విరివిగా ప్రచారం చేద్దామని ఎవరికైనా తడుతున్నదా? (ప్రచారం చేసే కర్తవ్యమున్న మేధావులు దీనికి జవాబులు చెప్తారా?) ఇదొక రకం మేధావి వర్గం.

> **రాజమండ్రిలో గోదావరి ఆనకట్టను కట్టిన కాటన్ దొర పేరును ఇప్పటికీ చాలామంది తలుచుకుంటారు. కొందరైతే నిత్య పూజలో ఆయన పేరును చేర్చి సంకల్పం చెప్పుకుంటారట. 'కావేరి వర్ధతాం, గోదావరి వర్ధతాం, కాటన్ దొర వర్ధతాం, కాలేవర్షతు వాసవా శ్రీరంగనాథో జయతు శ్రీరంగవర్ధతాం' అంటూ. వీరు తెలివికలవారు కానీ, మేధావులు కారు.**

మరి మన మేధావులు 'కావేరి వర్ధతాం! కాళేశ్వరం వర్ధతాం, కేసీఆర్ వర్ధతాం, కాలేకా లేవర్షతు వాసవా' అంటూ సంకల్పం చేస్తారా? ఎందుకు చేయరు? 'తొక్కేస్తాం, బొంద పెడతాం, పేరు లేకుండా చేస్తాం' అనే సంకల్పం మాత్రం చెప్తారు. ఎందుకంటే, వీరు 'కావేరి వర్ధతాం, కాళేశ్వరం వర్ధతాం, కేసీఆర్ వర్ధతాం' అని అంటే ఇంకేమన్నా ఉందా? అబ్బో బ్రహ్మాండం బద్దలైపోదు!

ఆశలు తప్ప, ఆశయాలకు దూరమైపోతే మేధోసంపత్తి ఇలానే భ్రష్టుపడుతుంది. ఇక యువ మేధావులు.. వారి ఆశలు ఎలా అయినా నెరవేరాలి తప్ప, ఇంకో మార్గం లేదంటారు. అయితే ఎదుటివారిని చంపుతారు, లేదా వారే ఆత్మహత్య చేసుకుంటారు. వీరితో మాట్లాడి వారిని సముదాయపరిచే వయసు మళ్లిన మేధ ఎక్కడుంది? తల్లిదండ్రులైతే వారి యువత జీవితంలో స్థిరపడితే చాలంటారు. ఆ తర్వాత వారు (యువత) ఎదుర్కొనే సమస్యల్ని మొదటే వారికి చెప్పి, వాటిని ఎదుర్కొన్నప్పుడు ఎలా పరిష్కరించుకోవాలనే చెప్పే సోయి ఎంతమంది పెద్దలకుంది? మొదట జీవితం గురించి చెప్పి (ఇది అందరికీ వడ్డించిన విస్తరి కాదని) ఆ తర్వాత పరికర్తవ్యం గురించి వివరించి, కొంత ధర్మం గురించి చెప్పి వారిని సమాజంలో వదిలిపెడితే యువత ఇంత ఒత్తిడి ఎదుర్కోదు. కానీ, చెప్పే వారెవ్వరు? వారిని, వారి ఉద్రేకాన్ని రెచ్చగొట్టి తమ స్వార్థం కోసం వాడుకునేవారు కొందరైతే, వారి బాధలను అర్థం చేసుకోకుండా 'ఎందుకు?, బలిసి, ఒళ్లు పొగరని, తెలివిత క్కువని' రకరకాలుగా కామెంట్ చేసేవారే అధికం కాదా? ఒక్కసారి సమాజంలోకి వెళ్లండి. ఎన్ని కుటుంబాలు సంతోషంగా ఉన్నాయో సర్వే చేయండి. ఆర్థికంగా బాగానే ఉంటారు. కానీ, సంతోషంగా ఎందరున్నారు? అసలు సంతోషం, సుఖం, ఆనందం అన్న భావాల్లో తేడా ఎంతమందికి తెలుసు. ఈ విషయమై మేధావులు ఆలోచించారా?

'ధర్మం, ధర్మం' అని మాట్లాడుతున్నారు అదెక్కడుందని అంటారా. చూడాలనుకుంటే మన జీహెచ్ఎంసీలో స్వీపర్ నారాయణమ్మను చూడండి. ఆమె ఏం చదువుకోలేదు. వెనుకబడినవర్గానికి చెందిన మహిళ. ఆమెతో మాట్లాడితే ధర్మం అంటే ఏమిటో చెప్తుంది ఆమె ఆచరిస్తూ. కల్లు గీసుకుంటూ బతుకువెళ్లదీసి అంతటా పరతత్వాన్నే చూసిన భూమాగౌడ్ గురించి తెలుసుకోండి. చిన్న ఉద్యోగం చేసి, శతకం రాసి, అక్షరాలతో పరతత్వాన్ని వర్ణించిన రామస్వామిని చదవండి. రూ.47 జీతంతో చప్రాసి ఉద్యోగం చేసి, తన క్రమశిక్షణ, తన కర్తవ్య నిర్వహణ, తాను పనిచేస్తున్న బడి, పిల్లల బాగోగులు తప్ప వేరొకటి పట్టక, ఊరి వారందరితో 'చప్రాసి సార్' అని పిలిపించుకున్న అటెండర్ గజ్జెల బాలయ్య గురించి తెలుసుకోండి. ధర్మమంటే ఏమిటో తెలుస్తుంది. (వీరిలో కొందరున్నారు, కొందరు పరమపదించారు) అది (ధర్మం) నిరంతరంగా తనను ఆశ్రయించుకున్న వాళ్లను రక్షించుకుంటూ పయనిస్తూనే ఉంటుంది. ఎందుకంటే, 'ధర్మో రక్షతి రక్షితః' కాబట్టి. కాకపోతే మనం (మేధావులం) దాని గురించి ఆలోచించాలంతే. మన పిల్లలకు వారి చిన్నతనం నుంచి చెప్పాలంతే.

> **చెప్పేవారు లేక, సమాజంలో కనిపించిన ఆకర్షణలకు లోబడి భోగాలసత్వం పెరిగి, దాని కోసం డబ్బు ఎలా సంపాదించాలా? అనే ఆలోచన తప్ప ఇంకే ఆలోచన లేకుండా యువత పోతుంటే మనం ఏం చేస్తున్నాం? ఈ ఒకవడిలో 27 సార్లు బంగారు హారం మెడల్లో నుంచి దొంగిలించి, జైలుకు వెళ్లి, తిరిగి వచ్చాక 28వ సారి మళ్లీ దొంగిలిస్తే! మార్గం ఏమిటి? మేధావులమైన మనకు ఇవేవీ పట్టవు. ఎందుకంటే, అది మన బాధ్యత కాదు, ప్రభుత్వానిదని అనుకుంటాం.**

మేధావులంతటా ఉన్నారు. కర్తవ్యం, బాధ్యత అనే విషయాలు మనవి కావని అనుకుంటూ, మన జీవితాలు మనవి, ఇంకొకరి విషయం మనకెందుకంటూ, కబుర్లు చెప్తూ, ఉన్న తవర్గాల్లో తిరగాలని ఆశిస్తూ ప్రయాణం చేస్తున్నాం.'ఇక్కడ ఓ మేధావి వర్గం ఉంది' అంటూ టంకశాల వారు మేధావుల గురించి మధనం చేస్తూ తిరుగాడుతుంటే ఈ వ్యాసం రాయాలని పించింది. వారికి కృతజ్ఞతలతో.

(వ్యాసకర్త: రిటైర్డ్ సర్జన్)

నేతన్నలకు ఒక పథకం, దళితులకు ఒక పథకం, గొల్లకుర్మవారికి ఒక పథకం అంటూ సమాజానికి ఏదో చేయబోతే.. గడీల పాలన, దొరల పాలన అంటూ కల్లబొల్లి మాటలతో ఊదరగొట్టిన నోర్లు ఇప్పుడెందుకు మూతబడ్డాయో మరి! మేధావుల మెదళ్లలో ఉన్న తెలివి అయిపోయిందా, లేక మేత మేస్తున్నాయా? ధర్మాన్ని మరిచి స్వార్థమొక్కటే రాజ్యమేలితే ఇటువంటి ఫలితాలే కనిపిస్తాయి.

తేనె తెలుగు

నీ॥ సంగీత సౌరభ సాహిత్య పవనమ్ము
ఈడుజోడు చెవుల జాడలడుగ
రాగతానమ్ములు రవళింప పల్లవి
త్యాగయ్య కృతికి కీర్తనము సేయు
దక్షిణ భారతి ద్రావిడ భాషలు
తెలుగు బాసకు తేనె లలుగులె